అహల్యాబాయి జయంతి



మన్సూరాబాద్: అహల్య బాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగుడి ప్రాంతంలో చేనేత కార్మికుల సంపర్క కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికుల గృహాలను సందర్శించి మగ్గాలతో పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించి, నేతన్నలకు సన్మానం చేశారు. అనంతరం అహల్యాబాయి జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ రఘురామ్‌నేత, గీతారెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి



కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: హయత్‌నగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల బీసీ హాస్టల్స్ ఓనర్స్ ఆసోసియేషన్ సభ్యులు తమకు హాస్టల్స్‌కు చెందిన బిల్లులు మూడేళ్ల నుంచి రావడం లేదని వెంటనే చెల్లించేలా చొరవ చూపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. బిల్లులు రాకపోవడంతో తాము బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇలానే ఉంటే హాస్టల్స్‌ను మూసేసే పరిస్థితి ఉంటుందని కృష్ణయ్యను కోరగా ముఖ్యమంత్రితో మాట్లాడి బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బాంబు స్క్వాడ్ ముమ్మర తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం ఎల్‌బీనగర్ పరిధిలోని వివిధ ప్రాంతాలల్లో బాంబు స్క్వాడ్ బృందం విజయవాడ బస్టాప్, రింగ్‌రోడ్డు, విజయలక్ష్మి థియేటర్, డీవీఎం కాలేజీ, మెట్రోస్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బాంబు స్క్వాడ్ బృందం హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, అప్పలరాజు, కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వనస్థలిపురం: తెలంగాణ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్‌రెడ్డి 129వ జయంతిని బుధవారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ కట్టా భగవంతరెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా, స్త్రీల సాధికారతకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, అంబర్‌పేట కూడళ్లలో ఆయన విగ్రహాలను ప్రతిష్ఠించాలని ప్రభుత్వాన్ని కోరారు. వనస్థలిపురంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూడిద జగన్మోహన్‌రెడ్డి, డా.గౌతమ్, ఊర్మిళాదేవి, జగన్, జగదీశ్వర్, రవిందర్‌రెడ్డి, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు షురూ

మలక్‌పేట: మూసారంబాగ్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని సంస్థ జనరల్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వినికిడి లోపం గల బాలబాలికలు 1 నుంచి 7వ, తరగతి వరకు అడ్మిషన్‌లో పొందవచ్చన్నారు. విద్యార్థులకు స్పీచ్ థెరపీ, కంప్యూటర్ విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, హాస్టల్ వసతి ఉచితంగా కల్పిస్తామని పూర్తి వివరాలకు 77022 43422, 94409 43677, 89770 43422 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బండ్లగూడ గ్రామం.. అభివృద్ధికి దూరం

- డ్రైనేజీ, తాగునీటి సమస్యతో సతమయం
- మౌలిక సదుపాయాలు లేక ఇక్కట్లు

నాగోలు: గతంలో ఉన్న జనాభాకు అనుగుణంగా నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడలో అప్పటి అవసరాల దృష్టిలో పెట్టుకుని అధికారులు డ్రైనేజీ, మంచీ పైప్‌లైన్, రోడ్లు నిర్మాణం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామ పంచాయతీ నుంచి, మున్సిపాలిటి, గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసి దాదాపు 15 సంవత్సరాల పూర్తి కావస్తున్న బండ్లగూడ గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామం చుట్టూ కొత్తగా ఏర్పాడిన నూతన కాలనీలో డ్రైనేజీ, మంచినీటి, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన అధికారులు బండ్లగూడ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్కడ మౌలిక సదుపాయాలు నోచుకోక బండ్లగూడ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని అధికారులు తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. వారు కూడా పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ధర్నాలు చేసే దుస్థితి నెలకొంది.

గుంతల రోడ్లు..

బండ్లగూడ గ్రామంలో తరుచూ తాగునీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలిసి వస్తుండటంతో దుర్వాసన వచ్చి రోగాలబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై స్థానికులు జలమండలి అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం గత కొన్ని నెలల క్రితం రోడ్లన్నీ తవ్వి వదిలేశారు. దీంతో గ్రామస్తులు కాలనీలో నడవలేని పరిస్థితి ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.



సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తున్న కాలనీ వాసులు(ఫైల్)



డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్లు తవ్వి వదిలేసిన దృశ్యం



బండ్లగూడ గ్రామంలో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు

చిన్నపాటి వర్షానికే జలమయం..

కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్లన్నీ తవ్వి వదిలేశారు. చిన్ని పాటి వర్షానికే మట్టి రోడ్లన్నీ జలమయమై రోజుల తరబడి దారుల గుంతల్లో వరదనీరు మురుగు నీరు చేరుతోంది. రోడ్లు బురదమయంగా మారి నడవడానికి, వాహనాల రాకపోకలకూ అసౌకర్యానికి గురవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. వర్షాకలం మొదలయ్యేలోగా సత్వరమే బండ్లగూడ గ్రామంలో సీసీ రోడ్లు పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. గతంలో బండ్లగూడ ప్రాథమిక పాఠశాలకు స్థలం లేకపోవడంతో స్థానికంగా ఉన్న కమ్యూనిటీ హాల్ కేటాయించారు. అప్పటి నుంచి పాఠశాల అందులోనే నడుస్తుంది. బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో భవనం పూర్తి చేసి పాఠశాలను అక్కడి తరలించి బండ్లగూడ కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించి నూతన భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ, జలమండలి ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసిన బండ్లగూడ సమస్యలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి బండ్లగూడ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి:

మెట్టు రవీందర్‌గౌడ్, బండ్లగూడ వాసి

మౌలిక వసతులు కల్పించాలి..



బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ ఇతర మౌలిక సదుపాయాల కల్పించాలి.

రాఘవేందర్ గౌడ్, బండ్లగూడ వాసి

నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: నాగోలు డివిజన్ బండ్లగూడ న్యూ అజయ్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు బి. వి. రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రాజాచారి, ప్రధాన కార్యదర్శిగా కుండే విఠల్‌రావు, జాయింట్ సెక్రటరీ సంపత్, ట్రెజరర్ వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మారోజు రవికుమార్, వాసుదేవరావు, బాలచందర్, గూడూరు అశోక్, గుజ్జ అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

9 నుంచి బ్రహ్మోత్సవాలు



ధ్వజస్తంభ తాపడ పనులను పరిశీలించిన కమిటీ నేతలు

మన్సూరాబాద్: ఆదిత్యానగర్‌కాలనీలోని శ్రీలక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 9 నుంచి వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ తాపన పనులను బుధవారం ఆలయ కమిటీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కంజర్ల రామకృష్ణ ఆచార్యస్వామి యాజ్ఞిక నిర్వహణలో బ్రహ్మోత్సవాలు జరిపేందకు నిర్ణయించినట్లు తెలిపారు. 9న ఉదయం 6గంటలకు బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, 11న ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బ్యాండ్‌బస్తీలో రూ. 15 లక్షలు నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి కృషి చేస్తామన్నారు. కాలనీలోని పాడైన రోడ్లలన్నీ బాగు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.నాణ్యత ప్రమాణాల్లో తేడా వస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో రోడ్డు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, నాయకులు సురేందర్, భరత్, క్రాంతి, ఆరీఫ్, గిరిజ, అసద్ పాల్గొన్నారు.

పాఠశాల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె సైదాబాద్ తహసీల్దార్‌ను చంపాపేటలోని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాంధీనగర్‌లోని భవనం నుంచి మెరుగైన వసతులు కలిగిన బీ-బ్లాక్ క్వార్టర్స్‌లోకి పాఠశాలను తరలిస్తున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావటానికి ముందే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల తరలింపు విషయమై ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు.

నాలాల్లో పూడిక తీయాలి



శంకేశ్వరబజార్ నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నాలాల్లో క్రమం తప్పకుండా పూడిక తీయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులకు సూచించారు. బుధవారం సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్‌లో ఎమ్మెల్యే కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ంసీ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షాలు కురిస్తే శంకేశ్వరబజార్ ఓపెన్ నాలా నుంచి మురుగు నీరు తమ ఇళ్లలోకి వస్తుందని శంకేశ్వరబజార్, సాయిరాం కాలనీ వాసులు వారి దృష్టికి తీసుకువచ్చారు. చిన్నపాటి వర్షాలకే మురుగునీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, శంకేశ్వరబజార్ ఓపెన్ నాలా వద్దకు వెళ్లి పరిశీలించారు. నాలాతో లన ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

జ్యోతిష్యం పేరిట మోసం చేసిన వ్యక్తి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్

నాగోలు: జ్యోతిష్యం పేరుతో మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని నాగోలు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ వివరాలు వెల్లడించారు. బోడుప్పల్ మేడిపల్లికి చెందిన సిరిగిరి సాయికుమార్ అలియాస్ సాయిరాజ్ నాగోలు జైపురికాలనీలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ జ్యోతిష్యాలయం నడుపుతున్నాడు. స్థానికంగా ఉండే ఓ మహిళ తనకు కుటుంబ సమస్యలు ఉన్నాయని జ్యోతిష్యం చూసి మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సాయికుమార్‌ను ఆశ్రయించింది. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న సాయికుమార్ పూజల పేరుతో ఆమె దగ్గర నుంచి బంగారు నల్లపూసల గొలుసు తీసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం సాయికుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వీల్‌చైర్స్ అందజేత



నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వజీర్‌ప్రకాశ్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం కొత్తపేటలోని ఆయన నివాసంలో ఇద్దరు దివ్యాంగులకు వీల్‌చైర్‌లను అందజేశారు. ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం నాయకులు రామచంద్రయ్య, ప్రకాశ్‌గౌడ్ కుమారులు నవీన్, ప్రవీణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

తాగునీరు.. రోడ్డుపాలు



ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పోచమ్మ దేవాలయం వద్ద తాగునీరు వృథాగా పారుతుంది. ఇక్కడి తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవటంతో నీరు ఏరులై పారుతోంది. విలువైన తాగునీరు వృథాగా పోతుందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. –చాదర్‌ఘాట్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.28, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.55, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.21, కీర రూ.35, బీన్స్ రూ.95, క్యాప్సికమ్ రూ.45.

ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వార్షికోత్సవాలు విజయవంతం చేయాలి

చాదర్‌ఘాట్: జూన్ 6, 7, 8 తేదీలలో జరిగే గరుడ అభయ ఆంజనేయస్వామి టెంపుల్ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చేగూరి వెంకటరమణ అన్నారు. 8వ తేదీన ఆదివారం శ్రీరామ కల్యాణం జరుగుతుందని కుటుంబ సమేతంగా వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్వాక్రా గ్రూపుల సంఖ్యను పెంచండి



యుగంధర్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ షఫిఉద్దీన్

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో డ్వాక్రా గ్రూపుల సంఖ్యను పెంచాలని డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ షఫిఉద్దీన్ ఎంఏయూడీ ప్రాజెక్ట్ అధికారి యుగంధర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మూసీనది పరీవాహక ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తుంటారని పేదరికం ఎక్కువగా ఉంటుందని వాటిని దృష్టిలో పెట్టుకొని మహిళలు ఆర్థిక ఎదుగుదలకు డ్వాక్రా గ్రూపుల నుంచి వచ్చే ఆర్థిక సహాయం అవసరముంటుందన్నారు.స్కూల్ యూనిఫామ్ కాంట్రాక్ట్ పనులు డ్వాక్రా గ్రూపులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యం



తిరుమలేష్

హయత్‌నగర్: విధులకు వెళ్లిన ఓ ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ వీరన్న గుట్ట కాలనీకి చెందిన కోవాకుల తిరుమలేష(43) ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్యూటీకి వెళ్తున్నానని చెపి ఈ నెల 12న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లి ఎంతకీ రాలేదు. తోటి ఉద్యోగులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సేవా కార్యక్రమాలకు రూ. 150 కోట్లు కేటాయింపు



చెక్కు విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వనస్థలిపురం: భారతదేశంలోని ప్రముఖ వ్యాపార సంస్థ, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మాతృ సంస్థ మలబార్ గ్రూప్ తమ సీఎస్ఆర్ కార్యక్రమాల కోసం 2025-26 సంవత్సరానికి రూ. 150 కోట్లు కేటాయించింది. ఆరోగ్య సంరక్షణ, విద్యా, ఆకలి తీర్చడం, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, పేదలకు గృహ నిర్మాణం వంటి అంశాలలో తమ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించనుంది. బుధవారం వనస్థలిపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ.. హంగర్ ఫ్రీ వరల్డ్ పథకంలో భాగంగా 2025-26 సంవత్సరంలో మొత్తం 2.50 కోట్ల మందికి ఉచితంగా భోజనాలు అందించాలని నిర్ణయించామని, భారత్, జాంబియా దేశాల్లో ప్రతిరోజు 70 వేల భోజనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. తమ వార్షిక సీఎస్ఆర్ బడ్జెట్‌లో 60 శాతం నిధులను నిరుపేదల ఆకలి తీర్చడం, పేదరిక నిర్మూలనకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో తనిష్క్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న అజయ్ ద్వివేది

వనస్థలిపురం: వనస్థలిపురంలో తనిష్క్ నూతన స్టోర్‌ను బుధవారం ప్రారంభించింది. టైటాన్ కంపెనీ లిమిటెడ్ రీజనల్ బిజినెస్ సౌత్ హెడ్ అజయ్ ద్వివేది ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది తెలంగాణలో 21వ, హైదరాబాద్ నగరంలో 17వ స్టోర్ అని కొనుగోలుపై బంగారు నాణెంను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ స్టోర్‌లో సున్నితమైన నమూనాలు, వికసించే పూల నమూనాలు, ఆధునిక మహిళల కోసం చిల్‌లె షేప్-సెట్ వజ్రాలతో ప్రేరణ పొందిన తాజా కలెక్షన్ 'ఎలాన్' అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ప్రారంభోత్సవంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తగ్గిన మిర్చి దిగుమతి



ఎస్‌జీఎస్ దామోదర్

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి దిగుమతుల తగ్గి మార్కెట్ ప్రాంగణమంతా వెలవెల బోయింది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు ప్రతిరోజు మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి రోజు 10 వేల బస్తాలు, 4 వేల క్వింటాళ్ల మిర్చి దిగుమతి అయ్యేది. గత వారం రోజుల నుంచి రోజుకు 8 క్వింటాళ్ల మిర్చి మాత్రమే దిగుమతి అవుతుందని అధికారులు తెలిపారు. రోజుకు మిర్చి సీజన్‌లో రూ. 15 లక్షల నుంచి 25 లక్షల వరకు ఆదామం వచ్చేదని అధికారులు తెలిపారు. వర్షాకాలం తర్వాతనే మిర్చి మార్కెట్ కళకళలాడుతుందని ఇపుడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిర్చి దిగుమతి లేదన్నారు. మళ్లీ డిసెంబర్ నుంచి మొదలవుతుందని మిర్చి దిగుమతి లేక మార్కెట్ ఆదాయం గణనీయంగా పడిపోయిందని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్



మన్సూరాబాద్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ భద్రీ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి సాయిసప్తగిరికాలనీలోని జైహనుమాన్ సిమెంట్ ఏజెన్సీలో బుధవారం తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌లతో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా జరుగుతుందన్నారు. స్లాబులు, పిల్లరు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ అన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో సిమెంట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తున్నామని, నిపుణులైన ఇంజినీర్లు స్లాబ్ సమయంలో సైట్ వద్దకు వచ్చి సహాయం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ నరేష్‌యాదవ్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ.. డివిజన్‌లో నూతనంగా వెలుస్తున్న కాలనీలతో పాటు ఇతర కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.